'వార్త'కు స్పందన

## మూల మలుపుల వద్ద ఉన్న మొక్కలు తొలగింపు



పిచ్చి మొక్కలను తొలిగిస్తున్న దృశ్యం

**బెజ్జంకి, అక్టోబర్ 11, ప్రభాతవార్త :** ప్రమాదాలకు నిలయాలుగా మూల మలుపులు అనే కథనం మంగళవారం వార్త దినపత్రికలో ప్రచురించగా స్థానిక సర్పంచ్ పెంటమీది శ్రీనివాస్‌గౌడ్ స్పందించారు. ఈ మేరకు రోడ్డుకు ఇరువైపుల పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించడంతో పాటు ఇరువైపుల రోడ్డును చదును చేయించారు. ప్రయాణీకులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి వార్తను ప్రచురించినందుకు వార్త దినపత్రికతో పాటు వార్త కథనానికి స్పందించి రోడ్డును చదును చేయించిన సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్‌కు ప్రయాణీకులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

వార్త

## మునుగోడు ఉప ఎన్నిక బరిలోకి విఆర్ఎలు ?

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని గత 79 రోజులుగా నిరవధిక సమ్మె చేస్తున్న ప్రభుత్వంలో కనీస కదలిక రాకపోవడంతో తమ నిరసనను తెలపడానికి నల్గొండ జిల్లా మునుగోడు ఉప ఎన్నిక బరిలోకి దిగడానికి జిల్లాలోని విఅర్ఎలు సిద్దమవుతున్నట్లు తెలుస్తుంది. ఈ మేరకు జిల్లాలోని చిన్నకోదూరు, సిద్దిపేట, కొముురవెల్లి, చేర్యాల, మద్దూరూ, దూళ్‌మిట్ట మండలాలకు చెందిన విఅర్ఎలు మునుగోడుకు వెళ్లి నామినేషన్ పత్రాలను తీసుకున్నట్లు తెలుస్తుంది. జిల్లా నుంచి 50 మంది విఅర్ఎలు మునుగోడు ఉప ఎన్నికలో నామినేషన్ వేయడానికి రంగం సిద్దం చేసుకుంటున్నట్లు సమాచారం. సిఎం కెసిఅర్ అసెంబ్లీ సాక్షిగా విఅర్ఎలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో పూర్తిగా విఫలమవుతున్నారని తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతు మునుగోడు ఉప ఎన్నిక బరిలో దిగడానికి సిద్దమవుతున్నట్లు విఅర్ఎల సంఘ ం నాయకుడు తెలిపారు. జిల్లాకు చెందిన విఅర్ఎలు మునుగోడు ఉప ఎన్నిక బరిలోకి దిగుతారా లేదా వేచి చూద్దాం మరి.!



మాట్లాడుతున్న కలెక్టర్ శరత్

## సంగారెడ్డిని ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చాలి

### జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో అక్టోబరు 11, ప్రభాతవార్త:**

జిల్లాను సింగిల్‌యూస్ ప్లాస్టిక్ రహిత జిల్లాగా మార్చడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు ప్లాస్టిక్ నియంత్రణకు మున్సిపల్ కమీషనర్లు శిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. మంగళవారం సంబంధిత అధికారులు, టాస్క ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బ్యాగుల స్థానంలో ప్రత్యామ్నాయంగా జూట్, కాటన్, నాన్ ఓవెన్ ప్యాబ్రిక్ బ్యాగులు వాడాలని వాటి పట్ల ప్రజలలో అవగాహన పెంచడానికి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నిభంధనలు ఉల్లంఘించిన వారిపై నిభంధనల ప్రకారం జరిమానాలు విధించాలన్నారు. మున్సిపల్ పరిధిలో పూర్తిస్థాయిలో నిషేదించేలా ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. గ్రామపంచాయతీలలో ప్రజలకు ఆవగాహన కల్పించి,ప్రత్యామ్నాయ వస్తువులు వినియోగించేలా చైతన్య పరచాలని కోరారు. సమావేశంలో కమీటి సభ్యులు వివిదశాఖల జిల్ల అధికారులు పాల్గోన్నారు.

## 'మన ఊరు మన బడి' పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ డాక్టర్ శరత్

**సంగారెడ్డి బ్యూరో అక్టోబరు 11,ప్రభాతవార్త:**

మన ఊరు మన బడి పథకం ద్వారా చేపట్టిన ప్రనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.శరత్ సంబందిత అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మన ఊరు మన బడి పనుల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పనులను సమీక్షించిన కలెక్టర్ పనులలో అలసత్వం వహించిన పలువురు అదికారుల పట్ల అసంతృప్తిని వ్యక్తం చేశారు. 15రోజులలోగా మిగిలిపోయిన పనులను లక్ష్యం మేరకు పూర్తిచేయాలని కలెక్టర్ అదేశించారు. పనులు పురోగతిలేని, నిర్లక్ష్యం వహించిన ఇంజనీయర్లు,అధికారులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇప్పటివరకు చేసిన పనులకు 10 కోట్లు కాగా, 7కోట్లు చెల్లించామన్నారు. పూర్తిచేసిన పనులకు రికార్డు చేసి, ఎప్పటికప్పుడు అన్‌లైన్‌లో కలెక్టర్ లాగిన్‌కు అప్లోడ్ చేయాలని అన్నారు.సమావేశంలో సంబందిత వివిదశాఖల అధికారులు పాల్గొన్నారు.

## నిజాయితీగా పనిచేసి ప్రజల మన్ననలు పొందాలి : సీపీ శ్వేత

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ శ్వేత

రౌడీలు, కేడీలు, అనుమానితుల కదలికలపై నిరంతరం నిఘాపెట్టాలని.. నీతి నిజాయితీగా విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందాలని సీపీ ఎన్.శ్వేత పోలీసు అధికారులకు సూచించారు. సీపీ కార్యాలయంలో మంగళవారం గజ్వేల్ డివిజన్ పోలీసు అధికారులతో పెండింగ్ కేసులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ ప్రతి కేసులో క్వాలిటీ విచారణ ఉండాలని కేసుల్లో శిక్షల శాతం పెంచాలన్నారు. ఫోక్సో, ఎస్సి,ఎస్టి గ్రేవ్ కేసుల్లో త్వరగా విచారణ పూర్తి చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేయాలన్నారు. కేసు నమోదు నుంచి చార్జిషీట్ వరకు ప్రతి విషయాన్ని కూలంకషంగా పరిశోధన చేసి ఫైనల్ చేయాలన్నారు. గంజాయి, పేకాటపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి సమూలంగా నిర్మూలించాలన్నారు. టార్గెట్ పెట్టుకొని పెండింగ్‌లో ఉన్న కేసులను పూర్తి చేయాలన్నారు. రాత్రి వేళాలల్లో పెట్రోలింగ్ ముమ్మరంచేసి తనిఖీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో పోలీసు అధికారులు మహేందర్, రమేష్, ఫణిందర్, వీరాప్రసాద్, కమలాకర్, రాజశేఖర్‌రెడ్డి, సైదానాయక్, సంజయ్ పాల్గొన్నారు.

## మారిన పోలీసుల ఫోన్ నంబర్లు

**సంగారెడ్డి, అక్టోబరు 11, ప్రభాతవార్త:** జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా పోలీసు ఠాణాల పోలీసు అధికారుల ఫోన్ నంబర్లు మారినట్లు డిఎస్‌పి రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జహీరాబాద్ డిఎస్‌పి నంబరు 8712656708, జహీరాబాద్ పట్టణ సిఐ 8712656731, జహీరాబాద్ రూరల్ సిఐ 8712656732, జహీరాబాద్ పట్టణ ఎస్‌ఐ 8712656763, జహీరాబాద్‌రూరల్ ఎస్‌ఐ 8712656764, కోహీర్ ఎస్‌ఐ 8712656765, చిరాగ్‌పల్లి ఎస్‌ఐ 8712656766, హద్నూర్ ఎస్‌ఐ 8712656769, రాయికోడ్ ఎస్‌ఐ 8712656770, ఝరాసంగం ఎస్‌ఐ 8712656771 మారినట్లు డిఎస్‌పి వివరించారు.

## పర్యావరణ మిత్ర జాతీయ అవార్డుకు మాజీ సర్పంచ్ ఎంపిక

**హుస్నాబాద్, అక్టోబరు 11, ప్రభాతవార్త :** అక్కన్నపేట మండలంలోని చౌటపల్లి గ్రామానికి మాజీ సర్పంచ్ వెల్ది శోభారాణి బహుజన సాహిత్య అకాడమి పర్యావరణ మిత్ర జాతీయ అవార్డుకు ఎంపికైనట్లు అకాడమి జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా వచ్చిన అవార్డును మంగళవారం హైదరాబాద్‌లోని జాతీయ కార్యాలయంలో జరిగిన సమావేశంలో శోభారాణికి అందజేశారు. శోభారాణి సర్పంచ్‌గా ఉన్నప్పుడు గ్రామంలో 100శాతం మరుగుదొడ్లు నిర్మించడంతో పాటు హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలను సంరక్షించినందుకు అభినందిస్తూ అవార్డు అందించడం జరిగిందన్నారు. కాగా శోభారాణికి అవార్డుకు ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షునికి రాష్ట్ర కమిటి సభ్యులు ముక్కెర సంపత్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.




అవార్డు అందుకుంటున్న శోభారాణి

వంటిమామిడి నుంచి బెజ్జంకి ఎక్స్‌రోడ్డు వరకు

# రాజీవ్ రహదారిపై భద్రతా చర్యలు చేపట్టాలి

### జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

జిల్లాలో వంటిమామిడి నుంచి బెజ్జంకి ఎక్స్ రోడ్ వరకు రాజీవ్ రహదారి వెంబడి భద్రతా చర్యలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ అధికారులను అదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రహదారులు, భవనాలుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వంటిమామిడి నుంచి బెజ్జంకి ఎక్స్ రోడ్ వరకు రాజీవ్ రహదారి మొత్తం తిరిగి ఎక్కడెక్కడ ప్రమాదాలు జరిగేప్రదేశాలు ఉన్నాయో గుర్తించి ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలో పూర్తి సమాచారాన్ని గజ్వేల్, సిద్దిపేట ఏసీపీలు, హెచ్‌కెఆర్ అఫీసర్లు కలిసి ప్రణాళికను రూపొందించాలన్నారు. ములుగు తహశీల్దార్ కార్యాలయం వద్ద ప్రమాదకరంగా ఉన్నందున సర్వీస్ రోడ్డు వేసేలా డిజైన్ రూపొందించాలన్నారు. ప్రజ్ఞాపూర్ దగ్గర రోడ్డు భద్రతకు అడ్డుగా ఉన్న దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని పక్కకు జరిపే విధంగా చర్యలు




మాట్లాడుతున్న జీవన్ పాటిల్

తీసుకోవాలని గజ్వేల్ మున్సిపల్ కమిషనర్ గణేష్, ఏసీపీకి సూచించారు. కెసిఅర్ నగర్‌కి వెళ్లడానికి వాహనాలు వ్యతిరేక దిశలో వెళ్తున్నందున అత్యధిక ప్రమాదాలు జరుగుతున్నాయని వాటి నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టరేట్ దగ్గరలో దర్గా రోడ్డు వద్ద ప్రమాదకరంగా ఉన్నందున ఇప్పటికే కలెక్టరేట్, సీపీ అఫీస్,త్వరలో వెటర్నరీ అసుపత్రి, కోర్టు కాంప్లెక్స్ ఇలా అనేక ప్రభుత్వ కార్యాలయాలు వస్తున్నందున జనాలకు ఇబ్బంది లేకుండా డిజైన్ రూపొందించాలన్నారు. కలెక్టరేట్ ప్రాంగణం నుంచి కమిషనర్ కార్యాలయం వరకు సెంట్రల్ లైటింగ్ పెట్టాలన్నారు. గ్రామాల నుంచి రాజీవ్ రహదారికి కలిసే ప్రదేశంలో స్పీడ్ బ్రేకర్స్, జీబ్రా క్రాసింగ్, సిగ్నల్సును ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో అయాశాఖల అధికారులు వెంకటేష్, శ్రీనివాస్, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ మహాసభలను విజయవంతం చేద్దాం

### పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:**

భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 24వ జాతీయ మహాసభలు ఈనెల 14 నుంచి 18 వరకు విజయవాడలో నిర్వహించడం జరుగుతుందని మహాసభలకు జిల్లా నుంచి పార్టీ కార్యకర్తలు, సానుభూతిపరులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేద్దామని అ పార్టీ జిల్లా కార్యదర్శి మంద పవన్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని ఎడ్ల గురువారెడ్డి భవన్‌లో సీపీఐ నాయకులతో కలిసి జాతీయ మహాసభలకు సంబంధించిన గోడ పత్రికను అవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రపంచంలో దేశంలో ప్రజా, కార్మిక వ్యతిరేక మితవాద ఫాసిస్ట్, మతోన్మాద శక్తులు పెరుగుతున్నాయన్నారు. దేశంలో ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రజాకంతక విధానాలు నిర్ద్వంద్వంగా అమలు చేస్తున్నారని తెలిపారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ మతోన్మాదాన్ని ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. సరళీకరణ, ప్రైవేటీకరణ పేరిట ప్రజలపై గుదిబండ మోపుతున్నారని పేర్కొన్నారు. లాభాల్లో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పోరేట్




జాతీయ మహాసభల గోడ పత్రికను అవిష్కరిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి పవన్

శక్తులకు కట్టబెడుతున్నారని వాపోయారు. నోట్ల రద్దు, జీఎస్‌టి, బ్యాంకుల విలీనికరణ, అగ్నిపథ్ వంటి అనాలోచిత విధానాలతో జన జీవనాన్ని అస్తవ్యస్తం చేశారన్నారు. మోడీ సర్కారు చీటికి మాటికి పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలతో పాటు గ్యాస్ సిలిండర్ ధరలను పెంచుతూ నిరుపేదలకు తీరని అన్యాయం చేస్తుందన్నారు. మహాసభలకు దేశంలోని వెయ్యి మంది కమ్యూనిస్టు అగ్రజల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈనెల 14న విజయవాడలో 5 లక్షల మందితో భారీ ప్రదర్శన, సభ జరుగుతుందన్నారు. మహాసభలకు జిల్లా నుంచి కార్యకర్తలు, మేధావులు, యువకులు, రైతులు, విద్యార్థులు, పార్టీ సానుభూతిపరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కిష్టపురం లక్ష్మణ్, అందే అశోక్, అదిరంగారెడ్డి, బెక్కంఠి సంపత్, కర్ణాల చంద్రం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా 21వ కల్యాణ పరువ శరణు మేళా

### పాల్గొన్న రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రదపాటిల్

**సంగారెడ్డి, అక్టోబర్ 11, ప్రభాతవార్త:**

కర్ణాటక రాష్ట్రంలోని బసవకల్యాణ్‌లో జరుగుతున్న 21వ కల్యాణ పరువ శరణు మేళా రాష్ట్రీయ బసవదళ్ అధ్యక్షులు శంకరప్పపాటిల్, రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి వినయ నగేష్‌పాటిల్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి మహిళా జగద్గురు పూజశ్రీ గంగా మాత, రాష్ట్ర బిసి కమిషన్ సభ్యులు శుభప్రదపాటిల్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బసవేశ్వరుడు అందరివాడని, ఆయన చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అంతకు ముందు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించి బసవేశ్వరుని జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమానికి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రసాద్ మధుశేఖర్, ప్రధాన కార్యదర్శి అన్మిశెట్టి జయప్రకాష్, కంది సర్పంచ్ వీరేశం, యువజన అధ్యక్షులు మల్లికార్జున్, శివరాజ్, జహీరాబాద్ లింగాయత్ సమాజ్ మహిళా అధ్యక్షురాలు ఉల్లిగడ్డ పద్మజ, యువజన నాయకులు ప్రశాంత్‌పాటిల్‌లు పాల్గొన్నారు.



సన్మానించి బసవేశ్వరుని జ్ఞాపికలను అందజేస్తున్న దృశ్యం

చాళుక్యుల కాలం నాటి

## వినాయక రాతి విగ్రహం

**మెదక్, అక్టోబర్ 11ప్రభాతవార్త :** మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలోని శివాలయంలో చాళుక్యుల కాలం నాటి వినాయక విగ్రహం లభ్యమైంది. వినాయక విగ్రహాన్ని తెలంగాణ చరిత్ర బృందం, యువ చరిత్ర పరిశోధకుడు కొలిపాక శ్రీనివాస్ తన క్షేత్ర పర్యటనలో గుర్తించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 అడుగుల ఎత్తున్న గణపతి తల దువ్వి పాపడ తీసినట్లు చేట చెవులు కుండలాలతో, ఏకదంతంతో, రెండు చేతులతో, కుడిచేత విరిగిన దంతం, ఎడమచేత తొండానికి కుడుము అందిస్తున్నట్లు, జంధ్యంతో రెండు నాగుల ఉదర బంధంతో, లలితాసనంలో కనిపిస్తున్నాడని తెలిపారు. శిల్ప శైలిని బట్టి ఈ వినాయకుడు 10,11(చాళుక్య) శతాబ్ధాల కాలం నాటిదని, వినాయకుడి ఉదరం మీద సాధరణంగా నాగ బంధం ఉంటుంది. కాని ఈ విగ్రహంలో మాత్రం రెండు నాగులు విడిగా కనిపిస్తున్నాయని అన్నారు. గ్రామంలో శివాలయంలో ఉన్న ఈ వినాయక విగ్రహం అరుదైనదని, ఇంతకు ముందు కూడ ఎక్కడా ఈ విగ్రహం కనిపించలేదని తెలిపారు. ఈ వినాయక విగ్రహం 15 సంవత్సరాల క్రితం గ్రామంలోని పడకుల కుంట కాలువ విస్తరణలో దొరికిందని గ్రామస్తులు తెలిపారు.



గవ్వలపల్లి శివాలయంలోని చాళుక్యుల కాలంనాటి వినాయక రాతి విగ్రహం

# ప్రజారక్షణ, భద్రతే లక్ష్యంగా సీసీ కెమెరాల ఏర్పాటు

### జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

**చిన్నశంకరంపేట, అక్టోబర్ 11, ప్రభాతవార్త:**

ప్రజల రక్షణ, భద్రతే లక్ష్యంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ రోహిణి ప్రియదర్శిని అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మలాని ఫోమ్స్ పరిశ్రమ నూతనంగా ఏర్పాటు చేసిన సీసీకెమెరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సీసీ కెమెరాలవల్ల నేరాలు అదుపులోకి వస్తాయన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన సీసీ టివి కెమెరాలను కంట్రోల్ రూమ్‌తో అనుసందానం చేయడం జరిగిందని తెలిపారు. దీని వల్ల నేరాలు అదపు కావడమే కాకుండా, నేరం చేస్తు పట్టుబడతామనే భయం నేరస్తుల్లో కలుగుతుందన్నారు. నిఘా వ్యస్థను పటిష్టం చేసేందుకే అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునేలా కృషి చేయాలని సూచించారు. పట్టణంలో మలాని ఫోమ్స్ పరిశ్రమ వారు సిఎస్ఆర్ నిధుల ద్వారా 5లక్షల36వేలతో 40 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. గతంలో ఖాజాపూర్ గ్రామంలో రెండు చోరీలు జరుగగా




మాట్లాడుతున్న ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని

గ్రామస్తులకు అవగాహన కల్పించడంతో వెంటనే వారు ముందుకు వచ్చి వారం రోజుల్లో 30 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయం అన్నారు. ఆ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆమె సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకుకు సంబంధించిన వివరాలు, ఓటిపి తదితర నెంబర్లు అడిగితే ఇవ్వద్దన్నారు. వాట్సాప్‌లో అనుమానస్పదంగా వచ్చే సందేశాలపై క్లిక్ చేయవద్దని సూచించారు. సర్పంచి రాజిరెడ్డి మాట్లాడుతూ పట్టణానికి 70 సీసీ కెమెరాలను ఏర్పాటుచేయాలని అడగ్గా 40 అందించినందుకు మలానిఫోమ్స్ యజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. అలాగే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదులు లేవని పరిశ్రయ యజమాన్యం దృష్టికి తీసుకెళ్తే వెంటనే 15 లక్షలు మంజూరు చేస్తానని ఆయన హామీ ఇచ్చినట్లు తెలి పారు. ఈ సంవత్సరం సీఎస్సార్ నిధులను గ్రామ పంచాయతికి ఖర్చుచేసి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు. మలాని ఫోమ్స్ సీఎండి పురుషోత్తం మలాని మట్లాడుతూ చిన్నశంకరంపేట పట్టణాభివృద్ధికి రూ. 10 లక్షలు ఖర్చు చేసేందుకు సిద్దంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నశంకరంపేట ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, మలాని ఫోమ్స్ అవినాష్ టాగా, ఉపసర్పంచి జీవన్, మాజీ సర్పంచులు శ్రీమన్‌రెడ్డి, ఎడ్ల కిష్టయ్య, నాయకులు లక్ష్మారెడ్డి, గోపాల్‌రెడ్డి, కోదూరి రమేష్‌గౌడ్, లక్ష్మాగౌడ్, బాబు, శంకరయ్య, శ్రీనివాస్‌రెడ్డి, రాధకిషన్, సాయిబాబ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.




డాక్టర్ దయానా మోంటెరోను సన్మానిస్తున్న గీతం బాధ్యులు

## కంటినిండా నిద్రతో మానసిక ఆరోగ్యం

### డాక్టర్ దయానా మోంటెరో

**పటాన్‌చెరువు, అక్టోబరు 11,ప్రభాతవార్త:** మానసిక ఆరోగ్యానికి సరైన ఆహారం తీసుకోవడం, శారీరక శ్రమతోపాటు కంటి నిండ నిద్రపోవాల్సిన అవసరం ఉందని కౌన్సిలింగ్ సైకాలజిస్టు, హైదరాబాద్ అకాడమీ ఆఫ్ సైకాలజీ వ్యవస్థాపక డైరెక్టర్ డాక్టర్ దయానా మోంటెరో అన్నారు. గీతం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌లోని మానసిక శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవంలో దయానా వక్తగా పాల్గొని ప్రసంగించారు. మనిషి ప్రవర్తన, ఆలోచన, భావాలను అనుసరించి మానసికస్థితి ఆధారపడి ఉంటుందన్నారు. ఆశావాదులు ఎక్కువ కాలం జీవించగలరని, అందుకు ప్రతి ఒక్కరూ ఆరోగ్యకరమైన ప్రవర్తనతో మెలగాలని సూచించారు. పరులతో మంచి స్నేహం, సంబంధాల, సంతృప్తికర కళాశాల జీవనం, మనతో మనం నిరంతరం అనుసంధానం కలిగి ఉండటం మంచిదని పేర్కొన్నారు. మానసిక ఆరోగ్య సమస్యల సంకేతాలను గుర్తించడం అనే అంశంపై ఎక్స్‌ప్రెషనిస్ట్ డ్యాన్సర్ పిచిదానంద శాస్త్రి ఔషదాలను వినియోగించి మానసిక కృంగుబాటును అధిగమించడం అనే అంశంపై ఫ్రీలాన్స్ ట్రాఫిక్ సైకాలజిస్టు అనుఘ ఉపన్యసించారు. కార్యక్రమానికి ముందు అతిథులను కార్యక్రమ నిర్వాహకులు మానసిక శాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దుర్గేష్ నందినీ అథులను పరిచయం చేయగా విశిష్ట ఆచార్యులు డాక్టర్ జీఏ రామారావు అతిథులను సత్కరించారు.

## జిల్లా ఆహార భద్రత అధికారి ఆధ్వర్యంలో తనిఖీలు

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 11, ప్రభాతవార్త :**

సిద్దిపేట జిల్లా కేంద్రంలో మంగళవారం అహార భద్రత అధికారులు తనిఖీలు నిర్వహించారు. నాణ్యత లేని పండ్లతో పండ్ల రసాలు తయారు చేసి విక్రయిస్తున్నారని ఓ వినియోగదారుడు జిల్లా అహార భద్రత అధికారికి ఫిర్యాదు చేశారు. దీంతో జిల్లా అహార భద్రత అధికారి క్రిష్ణమూర్తి మోడల్ బస్టాండ్ ఎదురుగా ఉన్న జ్యూస్ స్టాల్‌లో తనిఖీలు నిర్వహించారు. ప్రీజ్‌లో నిల్వ ఉంచిన జ్యూస్, డ్రై ఫ్రూట్స్ నమోనాలను పరిశీలనార్థం సేకరించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ అహార పదర్థాలలో నాణ్యత లోపించిన, మోతాదుకు మించి రంగులు, రసాయనాలు కలిపిన శాఖపరంగా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. నిబంధనలు పాటించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామన్నారు.



పెద్దగుట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో కోడిపందాలు, పేకాట పోటీలకు హాజరైన పందెం రాయుళ్లు

## నర్సాపూర్ అటవీ ప్రాంతంలో జోరుగా కోడి పందాలు.. పట్టించుకోని అధికారులు

**మెదక్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండలం మల్పర్తి శివారులోగల పెద్దగుట్ట సమీపంలోని అటవీ ప్రాంతంలో కొన్ని రోజులుగా జోరుగా కోడిపందాలు, పేకాట నిర్వహిస్తున్నారని సమాచారం. నగరానికి సమీపంలో నున్న నర్సాపూర్ అటవీ ప్రాంతాన్ని హైదరాబాద్‌కు చెందిన కొందరు వ్యక్తులు ఇక్కడ కోడిపందాలు, పేకాట నిర్వహిస్తూ లక్షల రూపాయిల బెట్టింగ్‌లు కడుతున్నట్లు తెలిసింది. ప్రతి శుక్ర, శని, ఆదివారం రోజుల్లో హైదరాబాద్ నుంచి పందెంరాయుళ్లు వచ్చి దూర ప్రాంతంలో వాహనాలను రోడ్డుకు సమీప ప్రాంతంలో నిలిపి అడవీలోకి వెళ్లి పందాలను నిర్వహిస్తున్నట్లు తెలిసింది. అయితే పందెంరాయుళ్లకు నర్సాపూర్ పట్టణంలోని ఒక ఇంటి నుండి ఆహారం, నీళ్లు, మద్యం వంటివి అందజేస్తున్నట్లు సమాచారం. ఈ విషయమై ఎస్‌ఐ గంగరాజును వివరణ కోరగా కోడిపందాల నిర్వహణ పై విచారణ చేపట్టి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ గంగరాజు తెలిపారు.

## నీటిలో గల్లంతైన వ్యక్తి మృతదేహం లభ్యం

**పాపన్నపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త:** మద్యం మత్తులో ఈతకై చెరువులో దూకి గల్లంతైన వ్యక్తి రెండు రోజుల తరువాత మృతదేహం లభ్యమైన సంఘటన మంజీరా చెక్‌డ్యాంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి ఎస్‌ఐ విజయ్‌కుమార్ కథనం ప్రకారం పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. హైద్రాబాద్‌లోని అంబర్‌పేటకు చెందిన పులిమామిడి ప్రసాద్(32) స్నేహితులతో కలిసి దేవి నవరాత్రుల్లో పూజలు అందుకున్న అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు ఏడుపాయల మంజీరా తీరానికి వచ్చి అమ్మవారిని నిమజ్జనం చేసి చిత్తుగా తాగి ఈతకై ఏడుపాయల మొదటి వంతెనపై నుంచి మంజీరాలోకి దూకి గల్లంతయిన విషయం పాఠకులకు విధితమే. గల్లంతైన వ్యక్తి కోసం పోలీసులు గత ఈతగాళ్లలో గాలింపు చర్యలుచేపట్టినా ఆది, సోమవారాలు అభ్యం కాలేదు. మంజీరాలో నీటి ఉద్రుది కొంత తగ్గడంతో మంగళవారం మరో మారు వెతుకుతుండగా బండరాళ్లకుతాకి శవం ఆగిపోవడంతో శవం కానవచ్చింది. మృతుడి తండ్రి పులిమామిడి రామాచారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మెదక్ ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ వివరించారు.

## అదృశ్యమైన వ్యక్తి చెరువులో శవమై తెలాడు..

**టేక్మాల్, అక్టోబరు 11, ప్రభాతవార్త:** మండల పరిధిలోని హసన్ మహ్మద్‌పల్లి గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యమైనట్లు టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో కుటుంబికులు పిర్యాదు చేశారు. అదృశ్యమైన వ్యక్తి సమీప చెరువులో పడి మృత్యువై కనిపించిన సంఘటన ఇది. హసన్‌మహ్మద్‌పల్లి గ్రామానికి చెందిన నీలం వంశీ (27) అనే ఈనెల 9వ తేదిన ఇంట్లో నుంచి టేక్మాల్‌కు పని ఉందని వెళ్లి సాయంత్రం వరకు ఇంటికి వచ్చి తిరిగి మళ్లీ ఎవరికి చెప్పకుండ బయటకు వెళ్లి పోయాడు. రాత్రి అయిన ఇంటికి రాక పోవడంతో కుటుంబ సభ్యులు అక్కడ ఇక్కడ వెతికి టేక్మాల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరుసటి రోజే సమిప చెరువులో శవమై కనిపంచాడు. మృతుని మృతికి కారణాలు తెలియరాలేవు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.



మాట్లాడుతున్న మహిపాల్‌రెడ్డి

## అభివృద్ధి పనులపై అధికారులు దృష్టి సారించాలి

### ఎంపిపి మహిపాల్‌రెడ్డి

**సిర్గాపూర్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** అధికారులు అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని ఎంపీపీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షులు మహిపాల్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రజాప్రతినిధులు వివిధ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి మహిపాల్‌రెడ్డి స్పందించి ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి సహకారంతో గ్రామాల్లోని సమస్యలను దశల వారీగా అభివృద్ధి చేసుకుందామన్నారు. తెరాస ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందన్నారు. గ్రామాలోన సీసీ రోడ్లు, ఆకాశ దీపాలు, సబ్‌స్టేషన్లు, ఇలా అనేక రకాల అభివృద్ధి చేసిన ఘనత తెరాస ప్రభుత్వానిదే అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఉపాధ్యక్షులు పరాగ్‌బాయ్ మాధవరావు, ఎంపీడీఓ సుజాత, వివిధ గ్రామాల సర్పంచ్‌లు ఎంపీటీసీలు, ప్రజా ప్రతినిధులు, ఆయా శాఖాల అధికారులు పాల్గొన్నారు.

## న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి



మాట్లాడుతున్న జేఏసీ నాయకులు

**సంగారెడ్డి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** న్యాయమైన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని నారాయణఖేడ్ లియాఫీ జేఏసీ నాయకులు సంగారెడ్డి, మాధవరావు అన్నారు. మంగళవారం లియాఫీ జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఎల్ఐసీ కార్యాలయం సమీపంలో ఏజెంట్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎల్ఐసీ పాలసీలపై విధిస్తున్న జీఎస్టీని తొలగించి పాలసీలపై తీసుకున్న రుణాలపై వడ్డి తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. న్యాయమైన సమస్యల పరిష్కరంలో యాజమాన్యం నిర్లక్ష్యం చేస్తోందని వారు పేర్కొన్నారు. అందువల్ల కేంద్ర ప్రభుత్వం స్పందించి న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లేనిఏడల ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆ సంఘం బాధ్యులు వైస్ ప్రెసిడెంట్ నర్వ పండరి, సంగారెడ్డి, భూంరెడ్డి, రమేష్, కాశీనాథ్, దుర్గయ్య, అంబాదాస్ పాల్గొన్నారు.

## వీర శైవ లింగాయత్‌లను ఓబిసిలో చేర్చాలి



ఓబిసి మోర్చ జాతీయ అధ్యక్షులు డాక్టర్ లక్ష్మణ్‌కు వినతిపత్రం అందచేస్తున్న లింగాయత్ సమాజ్ బాధ్యుల దృశ్యం

**పటాన్‌చెరువు, అక్టోబరు 11, ప్రభాతవార్త:** వీర శైవ లింగాయత్‌లను ఓబిసిలో చేర్చాలని సంఘం పటాన్‌చెరువు శాఖ గౌరవ అధ్యక్షుడు ఆకుల శంకరప్ప, అధ్యక్షుడు శివరాజ్‌పాటిల్, ప్రధానకార్యదర్శి అవంచా సుధాకర్ ఆధ్వర్యంలో ఓబిసి మోర్చ జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌ను కోరారు. మంగళవారం లక్ష్మణ్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం శంకరప్ప మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో లింగాయత్‌లను బిసిలో చేర్చారని గుర్తు చేశారు. తెలంగాణ ఏర్పాడ్డాక శాసనసభలో లింగాయత్‌లను ఓబిసిలో చేర్చాలని రాష్ట్రప్రభుత్వం తరపున ఓబిసి చైర్మన్‌కు విన్నవించినట్లు గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గంలో, పేదరికంలో ఉన్న లింగాయత్‌లను ఓబిసిలో చేర్చితే విద్యార్థులకు ఉద్యోగ, చదువురీత్యా ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజ్ బాధ్యులు యశ్వంత్, చంద్రశేఖర్, రాజు, నరేందర్, ప్రశాంత్, సర్వేష్ జగదీష్, అభిషేక్, కొవ్వూరి సంగమేశ్వర్, సంగప్ప ఉన్నారు.

## తెలంగాణ భవన్‌కు తరలివెళ్లిన టిఆర్ఎస్ నాయకులు



తెలంగాణ భవన్‌కు వెళుతున్న నాయకులు

**పటాన్‌చెరువు, అక్టోబరు 11, ప్రభాతవార్త:** టిఆర్ఎస్ వర్కింగ్‌ప్రెసిడెంట్, రాష్ట్ర ఐటి, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన టిఆర్ఎస్ పార్టీ రాష్ట్రస్థాయి విద్యార్థి, యువజన విభాగాల సమావేశానికి పటాన్‌చెరువు నియోజకవర్గంనుంచి పెద్దసంఖ్యలో విద్యార్థులు, యువకులు తరలివెళ్లారు. టిఆర్ఎస్ పార్టీ యువత విభాగం రాష్ట్ర నాయకులు గూడెం విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీగా బయలుదేరారు. కార్యక్రమంలో యువత విభాగం నాయకులు మోరాజ్‌ఖాన్, విద్యార్థి విభాగం జిల్లా కో-ఆర్డినేటర్ కృష్ణకాంత్ యాదవ్, నియోజకవర్గ కో-ఆర్డినేటర్ చెన్నారెడ్డి తదితరులు ఉన్నారు.

## క్రీడాకారునికి ఆర్థిక సహాయం

**సంగారెడ్డి, అక్టోబరు 11, ప్రభాతవార్త:** కలకత్తాలో జరిగిన జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో బంగారు పతకం సాధించి, ఢిల్లీలో జరిగే అంతర్జాతీయస్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో పాల్గొనేందుకు ఆర్థిక ఇబ్బందులు పడుతున్న హత్నూర మండలం సిరిపురం గ్రామానికి చెందిన మహేష్ గౌడ్‌కు సిరిపురం గ్రామానికి చెందిన గౌరగోని సత్యనారాయణగౌడ్, పది వేల రుపాయలను అందించారు. ఈ సందర్భంగా బంగారు పతకం సాధించిన క్రీడాకారుడు మహేష్‌గౌడ్‌ను సిరిపురం సర్పంచ్ విజయలక్ష్మి, మాజీ సర్పంచ్ నరేందర్, మాస్టర్ పోచయ్య, ఉప సర్పంచ్ వసంత, వీరేశం, రాజు, సురేష్, శ్రీనివాస్, కృష్ణ, మల్లేశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వీఆర్ఏల ముందస్తు అరెస్టు

**మెదక్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:**

రాష్ట్ర వీఆర్ఏల సంఘం పిలుపు మెరకు మంగళవారం భాగ్యనగరంలోని ఇందిరా పార్కు వద్ద ధర్నాకు వెళ్తున్న మండల వీఆర్ఏలను చిన్నశంకరంపేట పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం సోంత పూచికత్తుపై వారిని విడిచి పెట్టారు. వీఆర్ఏల సంఘం మండల అధ్యక్షుడు గడ్డం మైపాల్, శంకర్, నాగులు, అనిల్, రాజయ్య, వెణు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్లమ్మ అలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

**మిరుదొడ్డి, అక్టోబర్ 11, ప్రభాతవార్త :**

మండల పరిధిలోని లింగుపల్లి పుట్ట ఎల్లమ్మ అలయంలో మంగళవారం దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు సర్పంచ్ జోగారి బాలనర్సు, మల్లుపల్లి ఉప సర్పంచ్ కనకరాజు, ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల కోరిక మేరకు భక్తుల సౌకర్యార్థం సొంత ఖర్చులతో వసతి గృహాలు ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చారు. రెండు రోజుల్లో పనులు ప్రారంభించేలా చూస్తానని తెలిపారు. అలాగే అలయ భవన నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. రుద్రారం సిద్దిపేట బస్సు నడవక ప్రయాణీకులు ఇబ్బందులు పడుతున్నారని యధావిధిగా బస్సును నడపాలని గ్రామస్తులు కోరగా ఎమ్మెల్యే స్పందించి డిపో మేనేజర్‌తో మాట్లాడి బస్సును నడపాలని అదేశించారు. విద్యార్థులు, గ్రామస్తులు ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించకుండా అర్టీసి బస్సులలో ప్రయాణం చేసి సహకరించాలన్నారు. కార్యక్రమంలో బిజెపి మండల అధ్యక్షులు దేవరాజు, నాయకులు మద్దెల రోశయ్య, మల్లన్నగారి బిక్షపతి, రమేష్‌గౌడ్, తోకల శ్రీనివాస్ రెడ్డి, తోట భూపాల్‌రెడ్డి, మల్లేశం, ఆశాగౌడ్, ఆలయ కమిటీ సభ్యులు గుండిగారి లచ్చయ్య, సత్తయ్య గౌడ్, అశోక్‌గౌడ్, లింగుపల్లి, మల్లుపల్లి, రుద్రారం గ్రామస్తులు, పార్టీశ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే

### నాసికరం రోడ్డు పనులతో అధికారులపై ఎమ్మెల్యే ఫైర్

మండలంలోని లింగుపల్లి నుంచి మల్లుపల్లికి వెళ్లే దారిపై ఇటీవల నూతనంగా నిర్మించిన బీటీ రోడ్డు నాసిరకం పనులపై దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు పంచాయతీరాజ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. లింగుపల్లి నుంచి మల్లుపల్లి వెళ్లే దారిపై ఇటీవల మూడు నెలల క్రితం వేసిన బీటీరోడ్డు గుంతలు ఏర్పడడం రోడ్డుకు ఇరువైపులా పలుచోట్ల పెచ్చులూడిపోవడంపై స్థానికులు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించి సంబంధిత పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడారు. మూడునెలల క్రితం వేసిన బీటీ రోడ్డుపై ఎలా గుంతలు ఏర్పడతాయని ప్రశ్నించారు. కాంట్రాక్టర్ నాసిరకం పనులు అధికారుల పర్యవేక్షణ లోపం మూలంగానే ఇలాంటి పరిస్థితులు నెలకొంటాయని అధికారులపై ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. వెంటనే బీటీ రోడ్డును పర్యవేక్షించి మరమ్మత్తులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని అదేశించారు.

### అంబేద్కర్ భవనం కోసం ఎమ్మెల్యేను కలిసిన దళిత నాయకులు

మండల కేంద్రంలోని జిల్లా దళిత సంఘాల నాయకులు మద్దెల రోశయ్య, నక్క రాములు ఆధ్వర్యంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావును దళిత సంఘ మండల నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి మిరుదొడ్డిలో అంబేద్కర్ భవనం ఏర్పాటు చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే వెంటనే స్పందించి వారం రోజుల్లోగా కలెక్టర్‌ను కలిసి ప్రొసిడింగ్ జీవో తీసుకొని తన సొంత నిధులతో అంబేద్కర్ భవన నిర్మాణం కోసం కృషి చేస్తానని తెలిపారు. దీంతో దళిత సంఘ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు అస్క స్వామి, కిరణ్, మద్దెల మహేష్, నక్క సాయి, అల్లిబిల్లి కుమార్, కిషన్, బిక్షపతి, దార రమేష్ తదితరులు పాల్గొన్నారు.



లబ్దిదారులకు పెన్షన్ గుర్తింపు కార్డులను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

## నూతన పెన్షన్‌దారులకు కార్డుల అందజేత

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 11 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని బిజివెంకటాపూర్ గ్రామంలో సర్పంచ్ నీల మంజులరమేష్, ఎంపిటిసిల ఫోరం జిల్లా అధ్యక్షుడు కిరణ్‌గౌడ్ ఆధ్వర్యంలో గ్రామంలో ఇటీవల నూతనంగా పెన్షన్ మంజూరైన లబ్దిదారులకు గుర్తింపు కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం కెసిఆర్ ఏ ప్రభుత్వం చేయని విధంగా తెలంగాణను అన్ని విధాలా అభివృద్ధి చేస్తున్నారని, అదేవిధంగా 58 సంవత్సరాలకే ఆసరా పెన్షన్‌ను తెలంగాణ ప్రజలకు కల్పించి దేశంలోనే మన్ననలు అందుకుంటున్న ముఖ్యమంత్రి కెసిఆర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపసర్పంచ్ శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి పల్లె తిరుపతి, వార్డు సభ్యులు తార, ఎల్లేశ్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చెక్కల నరేష్, తెరాస గ్రామ శాఖ అధ్యక్షుడు తోకల బాబు, నాయకులు వెంకటేష్, సత్యనారాయణ, మండల సోషల్ మీడియా కన్వీనర్ బాలుముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమానికి కృషి చేసేది కమ్యూనిస్టులే

### -సిపిఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్



ఇంటింటి ప్రచారంలో పాల్గొన్న సిపిఐ నాయకులు

**అక్కన్నపేట, అక్టోబరు 11, ప్రభాతవార్త :** పేదల సంక్షేమానికి కృషి చేసేది కమ్యూనిస్టులే అని సిపిఐ మండల కార్యదర్శి కొమ్ముల భాస్కర్ అన్నారు. మంగళవారం అక్కన్నపేటలో ఈనెల14న జరిగే సిపిఐ 24వ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎడల వనేష్, మంద శ్రీనివాస్, మండల సహాయ కార్యదర్శులు మొండయ్య, రాజు, నాయకులు శ్రీనివాస్, గంగయ్య, వినోద్, కనకయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆలయాలను సందర్శించిన మాధవానంద సరస్వతి స్వామి

**కొల్చారం, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని శ్రీరేణుక ఎల్లమ్మ ఆలయాన్ని, శివాలయాన్ని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి సందర్శించి పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మికత చింతనతో పాటు భక్తి భావన పెరగాలన్నారు. గుడిలో దీపదూప నైవేద్యం సమకూర్చినప్పుడే భగవంతుడి అనుగ్రహం పొందుతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఉమరాజాగౌడ్, ఉపసర్పంచి చెన్నయ్య, సంగమేశ్వర్, దేవన్నగారి శేఖర్, వడ్ల ప్రభాకర్, రామకృష్ణగౌడ్, శివ కుమార్‌గౌడ్, దుర్గాప్రసాద్‌గౌడ్, కిరణ్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, పాండురంగాచారి, భాస్కర్, గౌడ సంఘం సభ్యులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## రామాలయ సందర్శన...

**పెద్దశంకరంపేట, అక్టోబర్11 ప్రభాతవార్త:** పురాతన రామాలయం పునరుద్ధరణ పనుల కోసం మంగళవారం తొగుట ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ కమిటీ సభ్యులకు పునరుద్ధరణ పనులపై సలహాలు, సూచనలు ఇచ్చారు. మాధవానంద సరస్వతి స్వామికి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. రామాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మొదట ఆయన అందరి సలహాలు, సూచనలు స్వీకరించారు. అనంతరం స్వామీజీ మాట్లాడుతూ పురాత రామాలయంలో గర్భగుడిలోని దేవతామూర్తులను తాకరాదన్నారు. గర్భగుడి ముందు ముఖ మండపం, అగ్నేయంలో రథశాల, వాయవ్యంలో కళ్యాణ వేదిక, వీటితో పాటు హనుమాన్ ఆలయాన్ని మార్పు చేయాలని సూచించారు. ఆలయ పునర్నిర్మాణ పనులను జనవరి 26న శంకుస్థాపన చేయాలని పేర్కొన్నారు. గ్రామస్థులందరి ఆమోదంతో ఆలయ పనులు ముందుకు సాగేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జంగం శ్రీనివాస్, సర్పంచి అలుగుల సత్యనారాయణ, ఆలయ కమిటీ అధ్యక్షులు గుజ్జరి కనకరాజు, మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మురళీ పంతులు, గ్రామ పెద్దలు, గ్రామస్థులు వేణుగోపాల్‌గౌడ్, ఆర్ఎన్. సంతోష్‌కుమార్, సుభాష్‌గౌడ్, కందుకూరి నర్సింలు, దాదిగారి గంగాధర్, రాగం శ్రీనివాస్, సిద్ధేశ్వర్, సత్యనారాయణ, దొడ్ల సర్వేశ్వర్, జంగం రాఘవులు, ఎర్రం రమేష్‌గుప్త, అనిల్, రమేష్, సంగమేశ్వర్ పాల్గొన్నారు.



ఆలయ కమిటీ సభ్యులకు పునరుద్ధరణ పనులపై సలహాలు, సూచనలు ఇస్తున్న మాధవానంద సరస్వతి స్వామి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే రసమయి

## బాపురెడ్డి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే

**బెజ్జంకి, అక్టోబర్ 11, ప్రభాతవార్త :** మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ పెండ్యాల బాపురెడ్డి రెండు రోజుల క్రితం మృతి చెందగా మంగళవారం మానకొండూరు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ బాధిత కుటుంబీకులను పరామర్శించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక మంచి అత్మీయ మిత్రుడిని కోల్పోయామని, అభివృద్ధిలో ముందుండి గ్రామాభివృద్ధికి నిరంతరం కృషి చేసే మంచి నాయకుడిని కోల్పోవడం చాలా భాదగా ఉందన్నారు. బాపురెడ్డి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉండి ప్రభుత్వం తరపున అదుకుంటామని హామీ ఇచ్చారు. అలాగే మండల కేంద్రానికి చెందిన ఐలేని కిరణ్‌రెడ్డి, పెరుకబండ గ్రామానికి చెందిన చెట్లపల్లి శేఖర్‌లు ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందగా ఇరువురి కుటుంబాలను పరామర్శి ంచి ఓదార్చారు. అయన వెంట నాయకులు మహిపాల్‌రెడ్డి, లక్ష్మణ్,తిరుపతి, రాజిరెడ్డి, తిరుపతిరెడ్డి, సంజీవరెడ్డి, సుధీర్‌రావు, శ్రీనివాస్ గుప్తా, రాజేశం, శేఖర్ బాబు, అయా గ్రామాల సర్పంచ్‌లు తఉన్నారు.

### బాధిత కుటుంబాన్ని పరామర్శించి బిజెపి శ్రేణులు

మండల పరిధిలోని లక్ష్మీపూర్ గ్రామ సర్పంచ్ పెండ్యాల బాపురడ్డి రెండు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా మంగళవారం బిజెపి రాష్ట్ర నాయకులు గడ్డం నాగరాజు, అజయ్‌వర్మ, మండల పార్టీ అధ్యక్షులు దోనె అశోక్‌లు బాధిత కుటుంబీకులను పరామర్శించి ఓదార్చారు.

## హన్మంత్‌ను పరామర్శించిన ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



రామారం సర్పంచ్ సరోజ భర్త హన్మంత్‌ను పరామర్శిస్తున్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

**రాయపోల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని రామారం గ్రామ సర్పంచ్ వంజరి సరోజ భర్త హన్మంత్ కొద్ది రోజులుగా ఆనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మంగళవారం ఆస్పత్రికి వెళ్లి హన్మంత్‌ను పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. హన్మంత్‌కు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

### వరికోత మిషన్ల ధరలపై గ్రామ పంచాయతీ తీర్మానం

**కొల్చారం, అక్టోబర్11 ప్రభాతవార్త:** మండల పరిధిలోని కొంగోడ్ గ్రామ పంచాయతీలో మంగళవారం ప్రజల సమక్షంలో వరికోత మిషన్ల ధరలను సర్పంచి కుకునూరి మంజుల సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో నిర్ణయించడం జరిగింది. చైన్‌మిషన్‌కు గంటలకు రూ.2600, ఫోర్ టైర్ మిషన్‌కు గంటకు రూ.2000, టూ టైర్ మిషన్‌కు గంటకు రూ.1800 ధరలను నిర్ణయించడం జరిగింది. ఈ మేరకు గ్రామ పంచాయితీ తీర్మాణం చేశారు. వరికోత మిషన్ల యజమానులు గ్రామ పంచాయితీ తీర్మానం మేరకు నిర్ణయించిన ధరలనే వసూలు చేయాలని సూచించారు.

### సదరం ధృవీకరణ పత్రాలకు తేదీల కేటాయింపు

**కొల్చారం, అక్టోబర్11 ప్రభాతవార్త:** మెదక్ జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో వికలాంగులను గుర్తించి అర్హత గల వారికి సదరం ధృవీకరణ పత్రము పొందుటకు గాను అక్టోబర్, నవంబర్, డిసెంబర్-2022 మాసములకు సంబంధించిన తేదీలను మీసేవ/ఈసేవ కేంద్రాలకు కేటాయించడం జరిగిందని ఎంపీడీవో ప్రవీణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హాజరు కాగోరు దివ్యాంగులు తమ దగ్గరలో ఉన్న మీసేవ/ఈసేవ కేంద్రం నందు ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకొని రసీదులో కేటాయింబడిన రోజున ఉదయం 9.00 గంటల నుండి మధ్యాహ్నం 12.00 గంటలకు హాజరు కావాల్సి ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు కాని వారు సదరం క్యాంప్‌కు హాజరు కావాల్సిన అవసరం లేదని తెలిపారు. మీసేవ రశీదు, ఫోటో, ఆధార్ జిరాక్స్, సంబంధిత మెడికల్ రిపోర్ట్స్ తీసుకుని రావాలన్నారు.

### నర్సాపూర్‌లోని అర్బన్ పార్క్‌ను సందర్శించిన సిసిఎఫ్

**మెదక్, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** నర్సాపూర్‌లోని అటవీ ప్రాంతంలో నున్న అర్బన్ పార్క్‌ను మంగళవారం రాజన్న సిరిసిల్ల సర్కిల్ ఇంచార్జీ సిసిఎఫ్ సైదులు సందర్శించారు. ఈసందర్భంగా డిఎఫ్ఓ రవిప్రసాద్ తో కలిసి ఆయన అర్బన్ పార్క్‌లో నడుస్తున్న కాటేజీల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. అదేవిదంగా అర్బన్ పార్క్‌లోని వాచ్ టవర్ ను సందర్శించి పరిశీలించారు. ఈ మేరకు అర్బన్ పార్క్‌లో నడుస్తున్న పనులను పలు విషయాలను ఆయన ఎఫ్ఆర్ఓ అంబర్‌సింగ్‌ను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిఎఫ్ఓ రవిప్రసాద్, సెక్షన్ ఆఫీసర్ బాలేశ్, బీట్ ఆఫీసర్ ప్రశాంత్ ఫారెస్ట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అర్బన్ పార్క్‌ను సందర్శించిన రాజన్న సిరిసిల్ల సర్కిల్ ఇంచార్జీ సిసిఎఫ్ సైదులు, డిఎఫ్ఓ రవిప్రసాద్ తదితరులు




బిజెపిలో చేరిన ఆయా పార్టీల నాయకుల దృశ్యం

## బిజెపిలో చేరిన వివిధ పార్టీల నాయకులు

**పటాన్‌చెరువు, అక్టోబరు 11, ప్రభాతవార్త:** పటాన్‌చెరువు నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన టిఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు భారతీయ జనతాపార్టీలో చేరినట్లు పటాన్‌చెరువు మాజీ శాసన సభ్యులు, బిజెపి రాష్ట్ర నాయకులు నందీశ్వర్‌గౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో చేరిన నాయకులను కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించినట్లు నందీశ్వర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు కొత్తకాపు జగన్‌రెడ్డి, బి మహేష్, బి మల్లేష్, సిహెచ్ వెంకటేష్, ఎన్ శ్రీనివాస్, కొల్చారం నగేష్, పొట్ట ప్రభాకర్, పొట్ట పెంటేష్, ఆదికుమార్, బైన మల్లేష్, రొయ్యపల్లి శంకరయ్య, ఒగ్గు సత్యనారాయణ పాల్గొన్నారు.

## నేటి నుంచి హజ్రత్ షేక్ షాబుద్దీన్ ఉర్సు ఉత్సవాలు



ఉత్సవాలకు ముస్తాబైన హజ్రత్ షేక్ షాబుద్దీన్ దర్గా

**సంగారెడ్డి, అక్టోబరు 11, ప్రభాతవార్త:** ఈ నెల 12వ తారీఖు నుంచి జహీరాబాద్ మండలంలోని శేఖాపూర్‌లోని హజ్రత్ షేక్ షాబుద్దీన్ 672వ వర్షం ఉర్సు ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటి అధ్యక్షులు ఎండి చెస్మద్దీన్ పేర్కొన్నారు. 12వ తేదీన గంధం ఊరేగింపు, రాత్రికి ఖవాలీ కార్యక్రమం ఉంటుందన్నారు. 13న దీపాల కార్యక్రమం, రాత్రికి ఖవాలీ కార్యక్రమం ఉంటుందన్నారు. 14వ తేదీన ఉర్సు ముగింపు కార్యక్రమాలు నిర్వహించి అన్నదాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఉర్సు ఉత్సవాలకు ఢిల్లీ, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో చేరుకుంటారని, భక్తులకు ఇబ్బందులు కలుగకుండా తగు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. వర్షం ఉత్సవాలను పురష్కరించుకుని దర్గాను రంగులతో, విద్యుత్ దీపాలతో అలంకరించినట్లు అధ్యక్షులు పేర్కొన్నారు.

## పత్తి పంట పరిశీలన

**రాయపోల్, అక్టోబర్ 11 ప్రభాతవార్త :** మండల పరిధిలోని అనాజిపూర్ గ్రామంలో నర్సింలు అనే రైతు తన నాలుగు ఎకరాల భూమిలో జనని సీడ్స్, జనని ఆకాష్ అనే బిటి పత్తిని సాగు చేశాడు. దీంతో పత్తి ఏపుగా పెరిగి పత్తి కాయలు ఎక్కువ కాయడంతో కంపెనీ సెల్స్ మేనేజర్ కనకయ్యతో పాటు చుట్టూ ప్రక్కల గ్రామాల రైతులు మంగళవారం పత్తి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఆకాష్ బిటి పత్తి చాలా ఏపుగా పెరిగి దగ్గర దగ్గరగా పెద్ద సైజులో ఒక్కో చెట్టుకు సుమారు 70 నుండి 80 కాయలు ఉన్నాయని రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఒక ఎకరానికి సుమారు 15 నుండి 18 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని రైతులు తెలిపారు. కార్యక్రమంలో డిస్టిబూటర్ గల్వ జీవన్‌రెడ్డి, డీలర్స్, సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

### పేదలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి

**జగదేవ్‌పూర్, అక్టోబర్ 11 (ప్రభాతవార్త):** పేదలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఆపదలో అండగా నిలుస్తుందని గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దౌలాపూర్ గ్రామానికి చెందిన మస్కూరి ఎల్లం, బరిగె లింగలు గతకొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందగా అధిక మొత్తంలో డబ్బులు ఖర్చు కావడంతో ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. మంగళవారం మస్కూరి ఎల్లంకు రూ.22వేలు, బరిగె లింగంకు రూ.24వేల చెక్కులు మంజూరు కాగా గజ్వేల్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ యాదిలక్ష్మిశ్రీనివాస్ రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయనిధి నుండి డబ్బులు రావడానికి సహకరించిన మంత్రి హరీశ్‌రావు, ఎంపి కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఎమ్మెల్సీ యాదవరెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ జూపల్లి భాస్కర్, కొండపోచమ్మ డైరెక్టర్ నాగరాజు, గ్రామ తెరాస అధ్యక్షుడు జూపల్లి మధు, మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు కుకునూరి నారాయణ, వార్డు సభ్యులు దేవేందర్, మ్యాడమైన సిద్ధులు, కర్ణాకర్, నర్సయ్య, చిన్న సత్యనారాయణ, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న దృశ్యం

## విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి

**సంగారెడ్డి, అక్టోబర్ 11 ప్రభాతవార్త:** విద్యుత్‌షాక్‌తోపాడిగేదె మృతి చెందిన సంఘటన నారాయణఖేడ్ మండల పరిధిలోని అకుల లింగాపూర్‌లో మంగళవారం జరిగింది. గ్రామస్థుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన తిరిగి నర్సాగౌడ్‌కు చెందిన పాడిగేదె ప్రమాదవశాత్తు దుర్గామాత మందిరం వద్ద విద్యుద్ఘాతానికి గురై మృతి చెందింది. దీనివిలువ సుమారు రూ. 80 వేలు ఉంటుందని గ్రామస్థులు తెలిపారు. ఈమేరకు విద్యుత్ అధికారులు గ్రామ పెద్దల సమక్షంలో పంచనామా నిర్వహించి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు. అధికారుల వెంట ఎంపీటీసీ రాధాకృష్ణ, గ్రామ పెద్దలు ఉన్నారు.

## ఆర్టీసీ బస్సు మినీ డిసిఎం ఢీ.. పలువురికి గాయలు

**సిద్దిపేట రూరల్, అక్టోబర్ 11, ప్రభాతవార్త:** సిద్దిపేట శివారులోని కరీంనగర్ రోడ్డు రంగిళా దాబా వద్ద అర్టీసి బస్సు మిని డిసిఎం ఢీ కొన్న సంఘటనలో పలువురు మంగళవారం పలువురు గాయలకు గురైనారు. స్థానికులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ నుంచి హైదారాబాద్‌కు వెళ్తున్న అర్టీసి బస్సు సిద్దిపేట పట్టణ శివారులోని కరీంనగర్ రోడ్డు రంగిళా దాబా వద్ద మలుగుతున్న క్రమంలో కరీంనగర్ వైపు వెళ్తున్న మిని డిసిఎం ఢీ కొన్నాయి. సంఘటనలో మిని డిసిఎం డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అర్టీసి బస్సు డ్రైవర్‌కు బస్సులో ప్రయాణీస్తున్న వారికి స్వల్ప గాయాలైనాయి. సంఘటనలో మిని డిసిఎం డ్రైవర్ వ్యాన్‌లో ఇరుక్కుపోగా స్థానికులు, పోలీసులు గడ్డ పారల సహాయంతో బయటకు తీసి చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ అసుపత్రికి తరలించారు. ఈ మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.



ఆర్టీసీ బస్సు, మినీ డిసిఎం ఢీకొన్న దృశ్యం